# క్రీనీడ

భాను

రిక్షాలో ఎవరో ముస్లింపిల్ల వెళ్తోంది. ఆ అమ్మాయిజుట్టు అచ్చం జానీజుట్టులాగే వుంది అసలు జానీకి అలా పైజామా తొడిగి అలా ఆదుపట్టా వేస్తే అచ్చం ముస్లింపిల్లలా వుంటుంది- తను యిపుడే చేస్తూంటుందో! ఇంకా ఆఖరి బెల్లుకొట్టలేదే మా వ్యాను అని తిట్టుకుంటుం దేమో బహుశా—

ఈ దరిద్రపు ట్రామింకా రాదేం - టైమయి పోతూంది. ఈపాటికి వాళ్ళబడి వదిలేసుంటారు. ఈపాటికి సరిగ్గా ఆ వీధిదగ్గరకొచ్చేసుంటుంది. "ప్రతిరోజూ కాచుకునుండేవాడే— యింకా రాలేదేం యివాళ" అని చూస్తుంది కామోసు. ఆ! ఏమో ఎవరికి తెలుసు! అంత గుర్తుంటాదా తను!

ట్రామొచ్చింది. లోపలకెక్కాడు. తలెత్త గానే ఎవరో వళ్ళెత్తుఅమ్మాయి చూస్తోంది. వెంటనే తలొంచుకున్నాడు. పాపం ఆ అమ్మా యి తనసుమ్యాంగా వున్నానని యీ అబ్బాయి తలతిప్పేసుకున్నాడనుకుని బాధపడుతుందేమో!

ఏడిసినట్టుంది తన ఎనాలిసిస్ తనెవడో! కాసేపుండి తరవాత షాపింగులో దిగిపోయేవాడు కదా! ఎవరో ఏమిటో బాధపడ్డం—యీ గొడవంతా ఏమిటి!... ..కూచున్నాడు. ఎదురుగుండా జానీ కనకవుంటే ఆ అమ్మాయి అందమంతా తాగెయ్యడూ! జానీ కనక వుంటే ట్రాము కిటికీలోంచి తేరిపిలేకుండా యిటూ అటూ వుండే ఎత్తుమేడలకేసీ సినిమాపోస్టర్లకేసీ ఆ చిన్న పెదాలు కొద్దిగా తెరిచి చూస్తూంటుంది, ఆ వెడల్పయిన నుదురుమీద పొత్తటిజుట్టు పడుతూనే వుంటుంది. తను వినుకులేకుండా పైకి తోసుకుంటూనే వుంటుంది. పక్కవాళ్ళు విని పోతారని గామోసు—గొంతుక కలచుకొని మెల్లిగా ఏదో పాడుకుంటూంటుంది. ఆ అబ్బాయికి మాత్రం ఆ పాట వినబడకపోయినా ఆ మాటలు మాత్రం వినబడుతూనే వుంటాయి. ఆ వంపుతిరిగిన గులాబీపెదాల్లోంచి వచ్చేమాటలు సాటిన్ గుడ్డమీద మంచిముత్యాల్లా జారిపోతూం టాయ్. తను బాగా వూహించుకుని ఆ అందా న్ననుభవించగలడు-తనొక్కడే.

అబ్బ ఎంత బావుంటుంది జానీ. జానకి ఆ అమ్మాయిపేరని చెప్పాడు వాళ్ళబడి కుర్రాడెవ రో. కానీ తనకేమిటో 'జానీ' అని పిలవటమే ఎంతో ఇష్టం- తనకెప్పుడైనా 'జానీ'అని నోరారా ఆ అమ్మాయిని పిలిచే భాగ్యం కలుగుతుందా! పక్కన కూచున్న బుర్రమీసాలా సామి ట్రాము ఆగ్గానే లేచి కాలుతొక్కేసి 'సారీ' అనేనా అనకుండా పోతున్నాడు. ఏమిటో సారీ అన్నంత మాత్రాన కాలుకేం కానట్టు గాబోలు.

అదుగో వాళ్ళబడి వదిలేశారు. వదిలేసి పావుగంట యుంటుంది. ఈపాటి కింటి కెళ్ళి టిఫిన్ తింటూవుంటుంది కామోసు. సాయంకాలం ఏం చేస్తుందో ఎక్కడ గంతులేస్తుందో! ఏమిటో తకి జానీగురించి అంత చనువుగా మాటాడుకోడమంటే మహా యిష్టం.

ట్రాం దిగాడు. అబ్బ వెధవ ట్రామూ వెధవ జనమూనూ. వుక్కబోసి చంపేసింది లోపల;

ఇంకా నయం! జానీ వచ్చే టైం దాటిపోయింది. లేపోతే తన్నిచూసి ఏమనుకుంటుందీ జిడ్డు మొహం—ఇంటికొచ్చాడు బయట కుర్రాళ్లో కబేగోల. హజారే, మంకాడూ వాళ్ళబొందా నూ ఎప్పుడూ క్రికెట్ గొడవే అంతెందుకు మొన్న క్రికెట్ మాచ్ కి ఆడాళ్ళుకూడా వచ్చారట. ఏమర్థమయి ఛస్తుందో, జానీవెళ్ళదు. అచ్చే ఆ అమ్మాయి అలాంటిదిగాదు.

స్వాయం కాలం ఏంతోచలే. ఎందుకంటె జానీ కనబడలే. రోజూ అమ్మాయి బడినించి వొచ్చే టైంకి వీధిచివర నిలబడతాడు. మళ్ళీ ఏమీ చెయ్యడు. జేబుల్లో చేతులెట్టుకు నుంచోడంతప్ప. అమ్మాయి అలా రావడం, రోడ్డుక్రాసుచెయ్యడం, ఎదురుసందులోకి నడవడం- అంతదూరాన ఆసందుమలుపు తిరగడందాకా చూస్తాడు. ఏదో ఆలోచించుకుంటూ వెనక్కితిరుగుతాడు.

కానీ అంతదూరాన్నించే యితన్ని చూస్తుంది. పదడుగుల దూరానికి రాగానే కళ్ళలోకి కళ్ళుగుచ్చి చూస్తుంది. తను చాలాఖంగారు పడిపోతాడు, గుండె అతివేగంగా పనిచేస్తుంది. జానీ కెలావుంటుందో? అమ్మాయి సందుమలుపు తిరగ్గానే తృప్తిగా ఆనందంతో చిన్నగా మెల్లిగా నవ్వుకుంటాడు.

ఇవాళ సాయంత్రం టైంకి రాలేకపోయాడు. ఏమిటో పిచ్చెక్కినట్లయింది. అలా షైరు వంకన వాళ్లవీధి ద్వారా బయలుదేరాడు. వాళ్ళవీధితనికి తెలుసు. వాళ్ళఇల్లూ తెలుసు. వాళ్లిల్లింత దూరంలో వుందనగానే ఎక్కడెవరేమనుకుంటారోఅని ప్రతియిల్లుచూస్తూజానీఇల్లుకూడాయాదాలాపంగా చూస్తూన్నట్టుచూస్తూవెడతాడు. కానీ యింతమటుకు యిన్నిసార్లా వీధిపై వెళ్ళాడుగానీ ఒక్కసారికూడా ఆఅమ్మాయి యింటోవుండదు. ఎపుడూ యింటోవుండదేం మొద్దుపిల్ల-! తను ప్రతిరోజూ వాళ్ళవీధిలోంచి వస్తున్నట్టుఏం తెలుస్తుంది జానీకి? ఏమో తెలుసేమో! మరి తెలుస్తే ఎందుకుండదు? అందువల్ల తెలీదేమో ....

పొద్దున్న ఆఅమ్మాయి బడికి బయలుదేరే టైం చూసి వీధిచివర్న నెత్తిమాడ్చే ఎండలో నుంచుంటాడు. ఒక్కొక్కప్పుడు ఎండమీద మహాకోపం వస్తుంది. చెయ్యడ్డుపెట్టుకుని కళ్ళుముడుచుకోడం తప్ప పాపం ఏంచెయ్యలేక పోయేవాడు ఎంత కోపంవొచ్చినా. ఇంతట్లో అమ్మాయి దూరాన కనబడుతుంది. అసలా అమ్మాయినడకే మహా నిర్లక్ష్యం. ఎంతమందిలో వెడుతున్నా తనుగుర్తుపట్టెయ్యగలడు అమ్మాయిని. తను ప్రయత్నించాడుకాని చేతకాలేదు తనకలాంటి నడక .....

అంతదూరంనుంచీ ఓమాటు చూస్తుంది. ఎండమీదపడుతూంటే మడిచిన సన్నటి నల్లటికళ్ళు యితని కళ్ళమీద అలానిలిపేస్తుంది. ఏమిటో ఆ చూపుల్లో మృదుత్వంగాని సీరియస్ నెస్ గానీ వున్నట్టు కనిపించదు. ఏదో శూన్యంగా వున్నట్టుంటాయి, ఎలావున్నా అవి యితన్ని గుచ్చినిలబెడతాయి. వాటినుంచి తను తప్పించుకోలేడు...

జానీతో మాట్లాడాలి. ఎలాగ? ఆ! ఏముందీ రేపుబడికెళ్తే దారిలో ఎదురుగుండా నిలబడి— 'యిదుగో అమ్మాయ్— నీతోమాట్లాడాలి' అంటాడు. ఏమంటుందేం మహా ఓవేళ తిట్టడం అంకిస్తే—మరీవిషమించి కొడితే ?...పరుగెడతాడు. వెనకాల పరుగెత్తదుగా— ఛా! తన్నెందుకు తిడుతుంది. తనంటే ఏదో ఒకవిధమయిన యిష్టంవుంది జానీకి. లేకపోతే తనకి జానీ అంటే అంత యిష్టం దేనికి? ఒక్క క్షణం అమ్మాయిని తలచుకోకుండా వుండడు కదా? అసలేం మాట్లాడాలో ఎలామొదలెట్టాలో తేలటంలే! లేపోతే యీపాటికి మాటాడేసి వుందును.

ఇంటికి చేరేసరికి ఎనిమిది కొట్టింది. ఈ పాపిష్టిలోకం లోకి మేలుకొలుపులాగా. ఏముంది తిండీ, నిద్రా మళ్ళీ పొద్దున్నే లేవడం... .....

కంచం తెచ్చిపెట్టుకోరా అన్నం పెడతా అంది వాళ్ళమ్మ, కంచం తెచ్చుకోడానికి బల్లకింద వంగాడు.

...తను పీటమీద కూర్చుంటాడు. "జానీ కంచం కాస్త తెచ్చిపెడతావా" అంటాడు కొంటెగా. జానీ అత్తగారున్నారని కొంచెంసిగ్గుపడి తలొంచుకుని ముసిముసినవ్వులు నవ్వుతూ కంచం తెచ్చిపెడుతుంది...

వంకాయకూర వెయ్యమంటావా అందివాళ్ళమ్మ. ....వాళ్ళింటో ఏదో ఫంక్షన్ జరుగుతోంది. తను పైగదిలోవున్నాడు. ఇంతలో వాళ్ళపిన్నికూతురు శాంత వచ్చింది. వెనకాల జానీవుంది. ఏమయితే అయింది. ఈఅవకాశం వదులుకోకూడ దనుకున్నాడు. దగ్గరకెళ్ళి ఏదో పుస్తకం పేరుచెప్పి చదివావా అని అడిగాడు. లేదంది. ఇంకేదో బాతాఖానీలోకి దిగారిద్దరూ. అలా తెలియకుండా నాల్గున్నర అయిపోయింది. జానీ ఎంతనుంచున్నా తనదగ్గరేవుంది. నాలుగున్నరకి కిందికెళ్ళి మొహంకడుక్కుని తలదువ్వుకొచ్చింది. వచ్చెదురుగుండా నుంచుంది. తనకా అమ్మాయి కళ్ళలోకి చూస్తుంటే ఏంమాట్లాడాలోతోచలే, అంత ముగ్ధుడ్నిచేసింది తన్ని. ఏమిటో ఆమె తనకోసమే పుట్టినట్టు అనిపించింది. ఇంతలో శాంతవచ్చి 'ఒరే నేవెళ్ళిపోతున్నారా' అంది. జానీకూడా వెళ్ళిపోతుందేమోఅని భయమేసింది, ఫరవాలేదు. బాబ్బాబూ రేపుగూడా వుండూ. అనిబతిమాలాడు, శాంత చిన్నగానవ్వి వెళ్ళిపోయింది. ఇంతలో అమ్మ పైకొచ్చింది "ఏరా వెధవా ఏమిటి జానీని పెళ్ళిచేసుకుంటానన్నావుటేంటి" అంటూకేక వేస్తూ,జానీతలొంచుకమ్మవెనకాల నుంచుంది. తను కొద్దిగా కంగారుపడ్డాడు. "అబ్బే ఎవరన్నారు—అసలు— ఏమిటి-నువ్వు—ఏమిటి—" అంటూకంగారుగా జానీమొహం చూశేప్పటికి తలొంచుకుని పెదాలునొక్కిపెట్టి నవ్వుతుంది. అబ్బ ఎంతతీయగా వుందో ఆనవ్వు,! అమ్మ వెనకాలనుంచుంటే అచ్చం ఇంటికోడ లయినట్టుంది.... .

ఏమిట్రా కంచంలో చెయ్యెట్టు కలాకూచున్నావ్ అంటుంది వాళ్ళమ్మ. తను కంగారుపడ్డా పైకేం సద్దిచెప్పకుండా తలొంచుకుని నవ్వుకుంటూ భోజనం సాగించాడు.

* * *

సాయంకాలం వీధిచివర నుంచున్నాడు. ఎవరో నలుగు రయిదుగురు పిల్లలతో వస్తోంది జానీ. జానీఏదో నవ్వుతో మాటాడుతోంది. అంతదూరం లోకొచ్చేటప్పటికి నవ్వులోనే చూసింది. ఎంత బాగున్నాయో ఆకళ్లు! నవ్వుతూంటే బుగ్గమీద సొట్ట మెల్లిగా తాకాలనిపించింది. జానీదాటివెళ్ళిపోతోంది. ఏదో మాటాడేస్తోంది, వెనకాలేవెడదామనుకున్నాడు-కానీ రౌడీఅనుకుంటుందేమో, కొంచెందూరం పోనిచ్చి వెనకాలే బయల్దేరాడు. మెత్తటిజుట్టూ, తెల్లటివోణీ, ఎర్రటిపరికిణీ నిర్లక్ష్యంగాపడే అడుగుచూస్తూ. వెడుతున్నాడు. జానీ ఏదో మాటాడుతోంది. మెల్లిగా వాళ్లందరూ ఓమారు వెనక్కి తిరిగిచూశారు. ఎందుకో కొంచం భయమేసింది. ఏంచెప్పిందో వాళ్ళతో— 'ప్రతి రోజూ యీ అబ్బాయి నాకోసం కాపలాకాస్తాడని చెప్పిందేమో'—ఛా! అలాఅనుకోదు తన్ని గురించి జానీ ఎప్పుడూ. అయినా నిజంఅంతేగా! అసలేం చెప్పుకుంటున్నారో. .

అలామెల్లిగా బీచికిపోయి కూచున్నాడు.... ఇంతలో పెద్దబాంబు పేలింది. తూళ్ళి జానీవాళ్ళ వీధికివతల పడ్డాడు. దెబ్బలుతగిలి రక్తంకారుతోంది. కానీ అలాగే లైలామజ్నూ సినిమాలో లాగ దేక్కుంటూ జానీ వాళ్ళింటిముందు పడిపోయాడు జానీ ఎవరోఅనుకుని లోపలకి తీసికెళ్ళింది. చిరాగ్గావున్నట్టుంది. ఎవరిమీదో విసుక్కుంటూ పెద్దపెద్దకేక లేస్తూంది. మెల్లిగా కట్లు కట్టింది దెబ్బలకి. వంటింట్లోకి తీసికెళ్ళి ఓపీట మీదకూలేసింది. కంచంపెట్టింది. అన్నంవడ్డిం

చింది. అంతవరకూ తన మొహం సరిగ్గా చూడలే. ఎవరో అనుకుంటుంది. అన్నం వడ్డించి పక్కనే కూచుని 'వూ! తిను' అని కూర వేస్తూ మొహం వేపు చూసింది. తన్నిగుర్తుపట్టింది. తనా వేపు చూసేసరికి వెంటనే తలొంచుకుని పెదాలు నొక్కి పెట్టి నవ్వుతోంది. అబ్బ ఎంత తీయిగా వుందో ఆ నవ్వు! ఆనందం పట్టలేక తనూ మెల్లిగా నవ్వాడు ..... ..

"ఇదేమిట్రా పిచ్చాడిలాగ నీలో నువ్వే నవ్వుకుంటున్నావ్", అంటూ మాటలు వినిపించి భుజం మీద చిన్న చరుపు పడింది. తలెత్తి చూసేసరికి వంటిల్లూ లేదు-జానీ లేదూ-మూర్తి చిట్టిగాడు నవ్వుతూ నిలబడ్డారు. వాళ్ళతో పాటింటికి బయలుదేరాడు. వీధినించి చాలామందింటి కెళ్ళిపోయారు. స్నేహితులిద్దరికీ ఏదో వంక చెప్పి జానీ వాళ్ళ ఇంటి వేపు నడిచాడు. వీధిముందుకు రాగానే మూర్తి చేతులో వున్న సిగరెట్టు లాగి అవతల పారేశాడు. ఒకవేళ చూస్తే తనూ కాలుస్తున్నాడనుకుంటుంది. జానీ వాళ్ళిల్లు దగ్గరకొచ్చేస్తోంది. చిట్టిగాడు "ఓరి నీ! యిదా సంగతి— ఎవరో చెప్పనా—జా ...." గబుక్కున వాడినోరు నొక్కేశాడు. "వెధవా వాళ్ళింటిముందు అరిచావంటే చంపుతా"నంటూ, ఏమిటో వాళ్ళింటి ముందేమీ గొడవచెయ్యకూడదట. వాళ్ళ వీధిలో సిగరెట్టు కాల్చకూడదట. లేపోతే జానీ తన్ని గూర్చి చెడ్డగా అనుకుంటుందని భయం. ఇంతమటుకొక్కరోజూ జానీ వాళ్ళ వీధిలో కనుపించలే. కానీ ప్రతిరోజూ వాళ్ళవీధంబడే వెడతాడు ఇంటికి దూరమయినా.



ఏమిటో తనసంగతి తనకే అర్థం కాదు. ప్రతిరోజూ జానీ బడికెళ్లే సమయానికి, వచ్చేసమయానికి వీధిచివర నుంచుంటాడు. అమ్మాయితో మాట్లాడలేదు. కనుచూపుమేర కనిపించేంతవరకూ అలా పిచ్చిగా చూస్తాడు. ఒకొక్కరోజు వీధిచివరకు వెళ్ళడం మానేస్తాడు. ఎందుకంటే ప్రతిరోజూ అవుతే ఆ అమ్మాయి అసహ్యించుకుంటుందేమో నని భయం. కానీ ఆ టైం కింకెక్కడా వుండలేడు. వీధిచివర కెళ్ళకపోయినా మేడమీద కిటికీలోంచి చూస్తాడు.

ఒకొక్కరోజు అలా ఎండ నెత్తి మాడుస్తున్నా నిలబడతాడు. అమ్మాయి వస్తుంది- ఏమిటో శూన్యంగా చూస్తుంది తనవేపు ఆ చూపుల్లో యేం వున్నట్టుగా కనబడదు- అర్థం లేకుండా వున్నట్టుంటాయి. అలా చూసి మామూలుగా వెళ్ళిపోతుంది- ఒకవిధమయిన చిరాకు బయలుదేరుతుందతనిలో, యేడుపుకూడా వస్తుంది- ఒకవేళ అమ్మాయి తన్ని వేళాకోళం చెయ్యటంలేదు కదా... ఈ ఆలోచన వచ్చినపుడల్లా అతనికి వుక్రోషం వస్తుంది- ఆ మర్నాడు యేమయినాసరే అమ్మాయికోసం వెళ్ళకూడదనుకుంటాడు- కానీ సరిగ్గా టైమయిందా—వుండలేడు-

అపుడపుడింకో ఆలోచనొస్తూంటుంది- ఇలా ప్రతిరోజూ అమ్మాయిని తప్పకుండా చూస్తాడు. ఇంకో రెండేళ్ళకు జానీకి పెళ్ళయిపోవచ్చు. ఆ తరవాత తనకి బాధ తప్ప యేం మిగుల్తుంది? అతను మరీని- కొన్నికొన్ని విషయాలు మరీ సీరియస్‌గా తీసుక్కుంటాడు- నిజానికి రోజులో యిరవైనాలుగ్గంటలూ జానీగురించే ఆలోచిస్తూంటాడు కదా! తన సంగతి అమ్మాయికేం తెలిసుంటుంది?

నాల్గున్నర దాటింది- బడి వదిలుంటారు- గబగబా వీధిచివరకి పరిగెత్తాడు, అనుకున్నట్టే అయింది- అపుడే జానీ రోడ్డు క్రాస్‌చేసి ఎదురు సందు వేపెడుతోంది- అలా చూస్తూ నిలబడ్డాడు- ఓ చిన్న పట్టుతాడు చేతిలో గిరగిరా తిప్పుతూ వెడుతూంది విలాసంగా, కొంతదూరంవెళ్ళి వెనక్కి తిరిగి చూసింది "యివాళ రాలేదేం చెప్మా" అనుకుంది గామోసు- ఈ మారు తన్ని చూడగానే తాడింకా విలాసంగా తిప్పుకుంటూ వెళ్ళిపోయింది- మళ్ళీ వెనక్కయినా తిరగలే- తన్నంతలో లోకువ కట్టి వేళాకోళం చేసినట్టనిపించింది- కానీ మొదటినించీ తనభిప్రాయంలో జానీ అలాంటిది కాదని-

తరవాత ఓరోజు వాళ్ళబడి కుర్రాడొకడితో మాటాడుతూంటే జానీ సంగతొచ్చింది- అదే- తను మాటవరసకన్నట్టుగా ఆ సంగతెత్తాడు-

తనకి యింట్రస్టులేని మామూలువిషయం వింటున్నట్టుగా పోజు పెట్టినా చెవులురిక్కించి విన్నాడు.

"ఆ అమ్మాయి బడిలో అందరమ్మాయిలకంటే తనందమయిన దాన్నని చెప్పుకుంటుంది, బలే గర్వం."

అతని ప్రశాంతమైన మనస్సులో పెద్దగాలి దుమారం లేచింది- ఆమెమీద తనకున్న పవిత్రమయిన, సున్నితమయిన అభిప్రాయాలమీద యిపుడు తను విన్నమాటలు తిరుగుబాటు చేశాయి- తనకి ఎవరూ, అందులోనూ అందమయిన వాళ్ళు, ఏమాత్రం అలావుండడం యిష్టంలేదు- అసలు మొదటినుంచి తను ఆ అమ్మాయంటే అంత యిష్టం యేర్పడ్డానికి కారణం—అంతందమయిన అమ్మాయి అంత అమాయకంగా, నిగర్వగా వుండడమే- ఆమె అమాయకత్వంలో ఏదో దైవత్వం వూహించుకునేవాడతను. కాని యేమిటో యిది విన్నతరువాత అమ్మాయిమీద తనకుండే గౌరవం, తను చూపే యిష్టతా సగం తగ్గిపోయినట్టనిపించాయి-

ఆ కుర్రాడి మాటలెందుకు విన్నాడాతను అనిపించింది. అమ్మాయినిగురించి తనిలా ఎంతనుకున్నామర్నాడు చూడకుండావుండలేకపోయాడు. ఆఅమ్మాయిమామూలుగానేవెళ్ళిపోతోంది. కానీ యివాళ ఆ అర్థంలేని అమాయికమైన చూపులు కొత్తగా మాట్లాడాయి—"చూశావా నేనెంత అందమయినదాన్నో! నాముందు నీలాటి కుర్రాళ్లు బానిసలు. ప్రతిరోజూ నీలాటి కుర్రాళ్ళని చూస్తూంటా. నాకోసం రోడ్డుదగ్గర కాస్తూవుంటారు" అని.

అతని లేతమనస్సు ఎంతోబాధపడింది. తెలీకుండా కళ్ళమ్మట నీళ్ళుతిరిగాయి. మెల్లిగాతలొంచుకుని బీచికి దారితీశాడు. దూరంగా ఒక్కడూ కూచున్నాడు. ఇకవుండబట్టలేక గట్టిగా పిల్లాడిలాగ చేతుల్లో మొహంకప్పుకుని వెక్కివెక్కి ఏడ్చాడు. ఆ యేడుపుకు అర్థంలేదు. యేమిటో వుండబట్టలేక పోయాడంతే.

అలాకాసేపయాక మనస్సెంతో తేలికపడ్డట్టనిపించింది. చెమ్మగిల్లినకళ్ళుపైకెత్తిచూశాడు. అప్పుడే సన్నగా చంద్రుడు దూరంగానీళ్ళలోంచి బయటకొస్తున్నాడు. చల్లగాతగిలి నట్టయింది వెన్నెల– ఆ వెన్నెల్లో తన పూర్వపు అమాయకపు జానీ తలొంచుకుని పెదాలునొక్కిపెట్టినవ్వింది,

తనుకూడా చిన్నగానవ్వాడు, అతని చెమ్మగిల్లిన కళ్ళలో వెన్నెల తళుక్కున మెరసింది–

మెల్లిగాలేచి యింటివేపు నడచాడు,



# ఓ దార్పు

సహారా

హృదయవీణా
తంత్రులేలనో
సడలి కదలి గోడున
కదలుచున్నవి!
ఇది భగ్నవీణా శకలము!
ఓ శకలమా!
వికలమైన తీగల నూగించగా
మూగుచున్నవి మూల్గుల సంఖ్యాకములుగ
రోదన చాలింపవా!
వేదన రాలింపవా?
భగ్నవీణ నగ్నిపాలు చేయ వీరు
ముందున కడుగిడ
వీయజాలరు ? శకలమా
నీ అకలంక ఆకారమీలాగు వీగి, రోగివై
మూల్గెదవా? మూర్ఛిల్లెదవా?
చెప్పుమా
హృదయమా!
ఇది బాధ గొంతులోని రొద
ఇది గాధ తంతులోని
మోసము దోసము
పెనవేసుకు పోయిన
ఉరి లోని పురి!
ఆశాలేశపు ఊసులోని
ఉరిలోని ఊపిరిలోన
మెదలుచున్న కధ
ఆదరముగ అగమను
చున్నది, శకలమా!
ఆనంద చందాల
అమృతపు పంధాల
తంత్రులన్నియు నిమంత్రితమై వంత పాడగ
జనమంత వింత వోవగ
వినగనీ మ్రోత
ఆగెదను శకలమా ఆగెదను!